



పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల వద్ద నిర్మించిన రిజర్వాయర్


నార్లాపూర్ వద్ద విడుదలవుతున్న నీరు(ఫైల్)

పాలమూరు ప్రాజెక్టుకు.. కేంద్రం నిధులు

పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులు.. ఖర్చుల వివరాలు(రూ.కోట్లలో)


ఆర్థిక సంవత్సరం	ప్రతిపాదన	సవరణ
2015-16	100.00	100.00
2016-17	7860.88	7860.00
2017-18	4000.00	1660.45
2018-19	3035.10	3035.00
2019-20	500.00	500.00
2020-21	370.14	370.14
2021-22	1034.10	1034.10
2022-23	1225.00	852.64
2023-24	1187.64	--------
మొత్తం	19,312.86	15,412.33

- కేంద్రమంత్రితో సీఎం సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయం
- జాతీయ హోదా లేనట్లేనని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రం అంగీకరిస్తే 60 శాతం నిధులిచ్చే అవకాశం
- రూ.55,082 కోట్లకు చేరిన అంచనా వ్యయం
- గత ఏడేళ్లలో చేసిన ఖర్చులు రూ.15,412 కోట్లు
- త్వరలో నిర్వహించే సమీక్ష తర్వాత తుది నిర్ణయం అంటోన్న అధికారులు

మహబూబ్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలకమైన పురోగతికి మార్గం ఏర్పడింది. పథకానికి కేంద్రం నిధులు ఇవ్వడానికి మార్గం సుగమం అయ్యింది. జాతీయ హోదా అంశంపై నెలకొన్న సందిగ్ధతకూ తెరపడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇటీవలి ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో జరిపిన సమావేశంలో ఈ అంశాలపై స్పష్టత వచ్చింది. ఈ పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని, కేంద్రం నిధులివ్వాలని కేంద్ర మంత్రిని కోరగా, ఆయన కేంద్రం ఇచ్చే సహకారంపై స్పష్టత ఇచ్చారు. 2014 తర్వాత జాతీయ ప్రాజెక్టుల విధానాన్ని కేంద్రం అమలు చేయడం లేదని చెప్పారు. అయితే కొన్ని ముఖ్యమైన ఇరిగేషన్ పథకాలకు, తాగునీరు, ఫ్లోరైడ్ ప్రాంతాలకు నీరిచ్చే పథకాలకు ప్రాధాన్యత దృష్ట్యా కేంద్రం ప్రధాన మంత్రి జల సంచయ్ యోజన పథకం కింద 60 శాతం నిధులిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సైతం నిధులిచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి స్పష్టం చేసినట్లు వెల్లడించారు. దీంతో పాలమూరు పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ నెలకొన్న వివాదానికి ఇక ఫుల్‌స్టాప్ పడ్డట్లేనని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు పనులపై త్వరలో పూర్తి సమీక్ష జరిపిన అనంతరం మార్పు చేర్పులతో రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేస్తారని, పనుల్లో మళ్లీ వేగం పుంజుకుంటుందని ఇంజనీర్లు వెల్లడిస్తున్నారు.

పెరిగిన అంచనా వ్యయం

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.35 లక్షల ఎకరాలకు సాగు నీరు, 1,226 గ్రామాలకు తాగునీరు, పరిశ్రమలకు నీటి వసతి కల్పించే నిమిత్తం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ ప్రాజెక్టును ప్రాథమికంగా రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టారు. ఆ తర్వాత పథకం రూపకల్పనలో జరిగిన మార్పులు, చేర్పులతో అంచనా వ్యయం రూ.55,086 కోట్లకు చేరింది. ఏడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.15,412 కోట్లు నికరంగా ఖర్చు చేసింది. ఈ యేడాది బడ్జెట్‌లోనూ ఈపథకానికి రూ.1187.64 కోట్లు కేటాయించారు. ఈ నిధులు దాదాపు వెచ్చించినట్లేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్టు కింద ఇప్పటివరకు నార్లాపూర్, ఏదుల, కరివెన రిజర్వాయర్లు దాదాపు 80 శాతం పూర్తయితే, ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం 50 శాతమే పూర్తయ్యింది. మొత్తంగా అండర్ టన్నెల్స్ పనులు మాత్రం వంద శాతం పూర్తయ్యాయి. ఈ పథకానికి కేంద్రం 60 శాతం నిధులిస్తే సుమారు రూ.33 వేల కోట్ల ఆర్థిక సహాయం అందే అవకాశముంది. అయితే ప్రాజెక్టుపై సమీక్ష అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే విధాన నిర్ణయం ఆధారంగా కేంద్రం నిధులను తీసుకొని పనులను కొనసాగిస్తారా? లేదా? అనే అంశం తేలనుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.


నార్లాపూర్ వద్ద తవ్విన సొరంగం

దమ్ మారో దమ్..



- కోస్గిలో గుట్టుచప్పుడు కాకుండా హుక్కా దందా
- పట్టణంలో రెండేళ్ల కిందట భారీగా పట్టుపడ్డ మత్తు పదార్థం
- ఆరు నెలలుగా మళ్లీ ప్రారంభం
- పలు పాన్‌షాపులు, హోటళ్లు కేంద్రంగా వ్యాపారం

కోస్గి రూరల్, జనవరి 8: నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా హుక్కా దందా సాగుతోంది. రెండేళ్ల కిందట ఈ దందా జోరుగా సాగుతోందని పత్రికల్లో వరుస కథనాలు రావడంతో పోలీసులు తనిఖీలు చేసి, పెద్ద మొత్తంలో హుక్కా పట్టుకొని, పలువురు పాన్‌షాప్ దుకాణాదారులపై కేసులు నమోదు చేశారు. అప్పటికే పలువురు యువకులు దీనికి అలవాటు పడ్డారు. ఆ తర్వాత కొంతకాలం కనిపించని ఈ హుక్కా దందా ఆరు నెలలుగా మళ్లీ సాగుతోందని చర్చ జరుగుతోంది. కోస్గి నుంచి తాండూర్ వెళ్లే మార్గంలో పలు పాన్‌షాపులు, హోటళ్ల వద్ద ఈ హుక్కా లభిస్తుందని సమాచారం. సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు యువకులు పెద్ద ఎత్తున హోటళ్ల వద్ద గుమిగూడి, ఈ హుక్కా తీసుకెళ్లి సేవిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని వినాయక్‌నగర్ కాలనీలో హుక్కా దొరుకుతోందని, యువకులు రాత్రిపూట హుక్కా తాగే మిషన్లు అటువైపు తీసుకెళ్తున్నారని సమాచారం. దీనిని ఎక్కువగా యువకులే సేవిస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దీనికి అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని చూస్తున్న నేపథ్యంలో ఇక్కడ హుక్కా దందాను కూడా లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కోస్గిలో రెండేళ్ల కిందట పట్టుపడ్డ హుక్కా ఫ్లేవర్లు

రైతులకు అండగా కాంగ్రెస్

- ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి
- కోయిల్‌సాగర్ నుంచి నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

దేవరకద్ర, జనవరి 8: రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి అన్నారు. జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు అయిన కోయిల్‌సాగర్ నుంచి సోమవారం వారు యాసంగి పంటలకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్‌తో పాటు వర్షాలతో ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండటంతో పంటలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. తాగునీటికి సరిపడ ఉంచి, నీటిని ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 10 రోజుల వరకు నీటిని విడుదల చేస్తారని, తర్వాత ఆపేసి మరో 10 రోజుల తర్వాత ఇస్తారని చెప్పారు. రైతులు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. 60 ఏళ్ల కిందట కట్టిన ఈ ప్రాజెక్టు చెక్కు చెదర లేదని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఏడాదికే పగుళ్లు వచ్చి కుంగిపోయిందన్నారు. కాళేశ్వరం పేరుతో ఆ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ప్రజా సంపద కొల్లగొట్టిందన్నారు. అంతకు ముందు ఆంజనేయ స్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు.

పర్యాటక కేంద్రంగా మారుస్తాం

నీటి విడుదల అనంతరం ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, పర్ణికారెడ్డి బోటు ఎక్కి, ప్రాజెక్టులో విహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కొండల మధ్య ప్రాజెక్టు ఉన్న ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మికాంత్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే ఉపేక్షించబోం

- జోగుళాంబ గద్వాల జిల్లా అదనపు ఎస్పీ రవి
- నకిలీ పురుగు మందులు అమ్ముతున్న వారి అరెస్టు
- అరెస్టు అయిన వారిలో ఇటిక్యాల, అయిజ దుకాణాల యజమానులు
- పరారీలో మరికొందరు..


నిందితులను చూపుతున్న అదనపు ఎస్పీ

గద్వాల క్రైం, జనవరి 8: అన్నం పెట్టే రైతులను మోసం చేయడం అన్నిటి కంటే హేయమైన చర్య అని, నకిలీ మందుల పేరుతో అమాయక రైతులను మోసం చేస్తే ఎవరినైనా ఉపేక్షించబోమని జోగుళాంబ గద్వాల జిల్లా అదనపు ఎస్పీ ఎన్.రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఇటిక్యాల, అయిజ పోలీస్ స్టేషన్ల పరిధిలో నకిలీ పెస్టిసైడ్స్ అమ్ముతున్న ముఠాను పట్టుకున్నట్లు తెలిపారు. అయిజలోని జై కిసాన్ ఎంటర్ ప్రైజెస్, ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలోని శ్రీనివాస ఆగ్రో ట్రేడర్స్ వారు మిరప పంట తెగుళ్లకు ఉపయోగించే తమ ట్రేసర్, డెలిగేట్ కంపెనీలు నీలి మందుల స్థానంలో నకిలీ మందులు తమ కంపెనీ పేర్లతో అమ్ముతున్నారని కంపెనీ ఉద్యోగి కేశవ సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. గత ఏడాది అక్టోబరులో అయిజ, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసి, విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారన్నారు. దీనిపై ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రామస్వామితో పాటు సిబ్బంది, అయిజ పట్టణ పోలీసులు అయిజ జైకిసాన్ ఎంటర్ ప్రైజెస్ షాపును, ఇటిక్యాల పోలీసులు సాతర్ల గ్రామంలోని శ్రీనివాస ఆగ్రో ట్రేడర్స్ షాపును తనిఖీ చేశారన్నారు. మందులపై ఒరిజినల్ ట్రేసర్, డెలిగేట్ కంపెనీల పేర్లు ఉన్నా.. బార్‌కోడ్‌ను స్కాన్ చేయగా, నకిలీ మందులని తేలిందన్నారు. దాంతో అయిజ, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌లలో వారిపై కేసులు నమోదు చేశామన్నారు. సీసీఎస్ అధికారులు ఆయా షాపుల యజమానులను విచారించగా అయిజ మండలం పులికల్‌కు చెందిన జావెద్ జమీల్ దగ్గర మందులు తెచ్చి అమ్ముతున్నట్లు గుర్తించారన్నారు. ఇటిక్యాల మండలం సాతర్లలో ఉన్న షాపునకు అయిజ పట్టణానికి చెందిన జవెద్ హుస్సేన్ ద్వారా మందులు వస్తున్నట్లు గుర్తించామన్నారు. జావెద్ జమీల్‌ను పోలీసులు విచారించగా ఇండియా మార్ట్ అనే యాప్‌లో జావెద్ జమీల్ సదరు మందులను సెర్చ్ చేశాడని చెప్పారు. దాంతో విజయ్ కుమార్ అనే వ్యక్తి జావెద్ జమీల్‌కు ఫోన్ చేసి మీరు సెర్చ్ చేసే కంపెనీ పెస్టిసైడ్స్‌లను తక్కువ ధరకు ఆన్‌లైన్‌లో అందిస్తామని చెప్పారన్నారు. బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేయించుకుని, నకిలీ మందులను సరఫరా చేస్తున్నాడని తెలిపారు. విజయ్‌కుమార్ విష్ణువర్ధన్ రెడ్డి అనే వ్యక్తి దగ్గర మందులు తెచ్చి అమ్ముతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి రాజస్థాన్‌ను చెందిన అంకిత్‌లాటి, మధ్యప్రదేశ్‌కు చెందిన సునైనా కార్యం దగ్గర మందులు తెచ్చి సప్లయ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ఘటనలో అయిజ పోలీస్ స్టేషన్‌లో ఆరు మందిపై, ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌లో ఏడు మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిలో అంకిత్ లాటి, సునైనా కార్యంలు పరారీలో ఉండగా, మోహన్‌గౌడు, జావెద్ జమీల్, విజయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డిలను అయిజ పోలీస్ స్టేషన్ పరిధిలో, తిమ్మారెడ్డి, జావెద్ హుస్సేన్‌లను ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.43,000 విలువ చేసే నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ పెస్టిసైడ్స్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు చేసినప్పుడు రశీదులు తీసుకోవాలని తెలిపారు. కాగా, అయిజ మండలం ఆర్డీఎస్ పరిధిలోని పరిసర గ్రామాల్లో ఇందులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఈ నకిలీ మందులను తయారు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

గంజాయి బ్యాగు లభ్యం


గంజాయి ఉన్న బ్యాగు

జడ్చర్ల, జనవరి 8 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీ బురెడ్డిపల్లి సమీపంలో గంజాయి ఉన్న బ్యాగు లభ్యమైంది. అనుమానాస్పదంగా బ్యాగు పడి ఉందన్న సమాచారం అందుకున్న జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా బ్యాగులో సుమారు కిలో గంజాయితో పాటు, వాటిని కొలిచే డిజిటల్ వేయింగ్ మిషన్ లభ్యమైంది. జాతీయ రహదారి గుండా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న కొందరు దుండగులు ఆదివారం అర్ధ రాత్రి అనంతరం సోమవారం తెల్లవారుజామున ఆ ప్రాంతంలో వదిలిపెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. జాతీయ రహదారిపై పెట్రోలింగ్ అధికంగా ఉండడం, జడ్చర్ల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఆ బ్యాగును జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి సమీపంలో గోదాములకు వెళ్లే దారిలో వదిలిపెట్టినట్లుగా అనుమానిస్తున్నారు. కేసును విచారణ చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- భార్యాభర్తలు దుర్మరణం


బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో.. మృతి చెందిన భార్యా భర్తలు హసీనా, హుస్సేన్

పెద్దకొత్తపల్లి, జనవరి 8 : ట్రాలీ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొని ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ దుర్మరణం చెందిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వావిళ్లబాయి సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రకల్ గ్రామానికి చెందిన హసీనా(25) మహ్మద్ హుస్సేన్ (28)లు గ్రామాల్లో పాత సామాన్లు కొనుగోలు చేసి అమ్ముకొని జీవనం కొనసాగిస్తారు. రోజువారిలాగే తన ట్రాలీఆటోలో పెద్దకొత్తపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామమైన చంద్రకల్‌కు వెళుతుండగా వావిళ్లబాయి సమీపంలో హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వెళుతున్న ఆర్టీసీ హైదరాబాద్ డిపో-2కు చెందిన బస్సు, ట్రాలీ ఆటోను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న హసీనా, మహ్మద్ హుస్సేన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాలీ ఆటో నుజ్జునుజ్జు అయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ పి.రాజుయాదవ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి షైబాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాజుయాదవ్ తెలిపారు. మృతులకు ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు.

మంచు కురిసే వేళలో..

మంచు మురిపిస్తోంది.. తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగలాంటి మంచుతో గుట్టలు వెండి కొండల్లా కనిపిస్తున్నాయి. కాదేది అనర్హం అన్నట్లు గుట్టలు.. చెట్లు.. ఊళ్లు, రోడ్లు అన్నింటినీ మంచు కప్పేస్తోంది. మంచు వల్ల రోడ్డు కనిపించక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వనపర్తి మండలం రాజపేటకు వెళ్లే దారిలో సోమవారం పొగ మంచు కమ్ముకున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

మంచుతో కప్పబడిన కొండలు



మంచుతో తెల్లగా కనిపిస్తున్న కొండ




రోడ్డుపై కురుస్తున్న మంచు

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
PVR ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
Cinepolis మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
Cinepolis సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
Cinepolis సుధా - శాలిబండ	మరియు
Cinepolis డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి	ఏషియన్ రాధిక - కాప్రా
PVR ఆర్.కె. - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
PVR గలేరియా - పంజాగుట్ట	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
PVR ఐకాన్ - హైటెక్‌సిటీ	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ సినిమాస్ - చందానగర్
PVR పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	లక్ష్మీనరసింహ - మియాపూర్
PVR ప్రెస్టీజ్‌మాల్ - గచ్చిబౌలి	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
PVR ఎస్2 నోమ - మల్లాపూర్	మూవీటైమ్ - అమీర్‌పేట
INOX జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
INOX ఎం.పి మాల్ - కాచిగూడ	టివోలి - సికింద్రాబాద్
INOX జిఎస్ఎమ్ - మదీనగూడ	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
INOX నెక్లెస్ సత్య - కవాడిగూడ	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
INOX అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	షా షహెన్‌షా - చింతల్
Cinepolis మంజీరామాల్ - కూకట్‌పల్లి	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
Cinepolis సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	మూవీమ్యాక్స్ - మౌలాలి
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
Cinepolis సుధా - శాలిబండ	మరియు
Cinepolis డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్	మీ అభిమాన థియేటర్లలో

వ్యర్థాలను తగులబెట్టొద్దు

» పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



పంట వ్యర్థాలను పొలంలోనే కలియదున్నాలని రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాడూరు, జనవరి 8 : రైతులు పొలాల్లో సాగుచేసిన వ్యవసాయ పంటలకు సంబంధించిన వ్యర్థాలను తగులబెట్టడం మూలంగా భూమి స్వభావం దెబ్బతినడంతో పాటు కాలుష్యం పెరుగుతుందని తద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకరరెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని యత్మతాపూర్ గ్రామంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన పంట వ్యర్థాలను తగులబెట్టకుండా(కాల్చకుండా) వాటన్నింటినీ ట్రాక్టర్ రోటవేటర్ సహాయంతోనే పొలంలోనే కలియదున్నినట్లయితే భూమికి అనూహ్యమైన బలం చేకూర్చడంతో పాటు, మరుసటిసారి సాగు చేసే పంటకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలా చేయడం మూలంగా భూసారం పెరిగి దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. రైతులందరూ తప్పనిసరిగా తాము చేసిన సాగు పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలోనే దున్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సాయిరమేష్, ఏఈవో కార్తీక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డితో పాటు, గ్రామానికి చెందిన, పరిసర గ్రామాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు

కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని శ్రావణితో హెచ్‌ఎం లలిత, పీఈటీ చిట్టి

ఖిల్లాఘణపురం, జనవరి 8 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.శ్రావణి రాష్ట్ర స్థాయి జూనియర్స్ విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.లలిత, పీఈటీ చిట్టి తెలిపారు. ఈనెల ఏడున పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్‌లో విద్యార్థినీ ప్రతిభ కనబర్చింది. ఈనెల పదో తేదీన గజ్వేల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రావణి ఎంపికైందని వారు వివరించారు. సోమవారం పాఠశాలలో ఎమ్మెల్యే మేఘారెడ్డి తన జన్మదినాన్ని జరుపుకొని కేక్ కట్ చేసే సమయంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శ్రావణిని అభినందించి, స్వయంగా కేక్ తినిపించారు. రాష్ట్ర స్థాయిలోనూ విద్యార్థినీ ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలానగర్ ఘటనలో డీసీఎం డ్రైవర్ అరెస్ట్, రిమాండ్

» ఆందోళనకారులపై ఆరా తీస్తున్న పోలీసులు

జడ్చర్ల, జనవరి 8 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి ముఖ్య కూడలిలో ఈ నెల ఐదో తేదీన జరిగిన దుర్ఘటనలో డీసీఎం డ్రైవర్ కృష్ణకుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ ముఖ్య కూడలిలో ఆటోను డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయని తెలిపారు. డీసీఎం డ్రైవర్‌ను సోమవారం మహబూబ్‌నగర్‌లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. రోడ్డు దాటుతున్న ఆటోను డీసీఎం ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్‌తో పాటు, ఓనర్‌పై కేసు నమోదు చేశామని, అలాగే డీసీఎంను దగ్ధం చేయడంతో పాటు, పోలీసులపై దాడి, జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆందోళనలో పాల్గొన్న వారిపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. కాగా ఇప్పటికే 24 మందికి పైగా ఆందోళనకారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

» బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి



మాట్లాడుతున్న బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

వెల్దండ/కల్వకుర్తి, జనవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని కొట్ర గ్రామంలో ఇటీవల గుర్తుతెలియని దొంగలు పలు ఇళ్లలో చోరీలకు పాల్పడగా సోమవారం బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పరామర్శించారు. ఆయా కుటుంబాలలో జరిగిన నష్టాన్ని ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఆచారి ధైర్యం చెప్పారు. అనంతరం కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథిని కలిసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆచారి కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో గస్తీ నిర్వహించాలని చెప్పారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయని, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లోని యువకులు గస్తీలు నిర్వహించాలని, ఇతర గ్రామాలకు వెళ్లినప్పుడు పక్కింటివారికి సూచనలు చేయాలని ఆచారి తెలిపారు. నియోజవకర్గ ఇన్‌చార్జి యెన్నం శేఖర్‌రెడ్డి, నాయకులు బండెల రాంచంద్రారెడ్డి, విజేందర్‌రెడ్డి, పరమేష్‌గౌడ్, జంగయ్యయాదవ్, కృష్ణగౌడ్, దుర్గాప్రసాద్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

జిల్లెలలో పోచమ్మ దేవత విగ్రహం ప్రతిష్ఠ

కల్వకుర్తి, జనవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండల పరిధిలోని జిల్లెల, యంగంపల్లి గ్రామాల శివారులో సోమవారం పోచమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ఠ వేద మంత్రోచ్చారణల మధ్య జరిగింది. జిల్లెల సర్పంచ్ ఎముక జంగయ్య ఆధ్వర్యంలో జిల్లెల, యంగంపల్లి గ్రామాల నాయకులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మతల్లిని తలకొండపల్లి జడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్, ఐక్యత ఫౌండేషన్ నాయకుడు వరప్రసాద్ రెడ్డి, పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.లక్షా 40వేల విలువ గల గ్రానైట్ సమకూర్చారు. దీంతో నిర్వాహకులు ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డిని, నాయకులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. సర్పంచ్‌లు ఎముక జంగయ్య, శ్వేత, ఎంపీటీసీ సభ్యురాలు శోభ, నాయకులు పాండుగౌడ్, యాదగిరిరెడ్డి, రాంరెడ్డి, సత్యం, రవి, పలువురు నాయకులు ఉన్నారు.

రేపు అభయుడి టెండర్లు

ఊర్కొండ, జనవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం టెండర్లు ఈనెల 10(బుధవారం) హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్క సంవత్సర కాలం పాటు ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, తీర్థ ప్రసాదాలు, పూజ సామగ్రి, కొబ్బరి చిప్పలు తదితర విక్రయాలు జరుపటానికి టెండరుదారులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో మూడు పర్యాయాలు టెండర్లు అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయన్నారు. దాంతో ఈనెల పదో తేదీన ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కార్యాలయం, తిలక్‌రోడ్డు బొగ్గుల కుంటలో నిర్వహించనున్నామని, ఆసక్తి గల టెండరుదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

పురపాలికలకు కేంద్రం అవార్డులు

ప్రజల సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యత ఇస్తాం..



మా మునిసిపాలిటీకి ఓడీఎఫ్ అవార్డు రావటం ఆనందదాయకం. అయిజ మునిసిపాలిటీలో ప్రజల సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యత ఇస్తాం. మునిసిపల్ పరిధిలో ఉన్న పర్దిపూర్, తుపతురాల గ్రామాల్లో సైతం సౌకర్యాల కల్పనకు ప్రాముఖ్యత ఇస్తున్నాం. ఇందులో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉంది. మున్ముందు మరింత అభివృద్ధికి, సౌకర్యాల కల్పన ఏర్పాటు కోసం కృషి చేస్తాం.

- దేవన్న, అయిజ మునిసిపల్ చైర్మన్

సమన్వయంతో ముందుకు వెళతాం..



సమన్వయంతో పనిచేస్తే విజయం సొంతమవుతుంది. తమ మునిసిపాలిటీకి ఈ అవార్డు రావటానికి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధుల సహకారం, ఉన్నతాధికారుల తోడ్పాటు ఉంది. ఇందులో ప్రజల పాత్ర సైతం ఉంది. ఎక్కడ ఆటంకాలు కలగకుండా పనులు పూర్తి చేశారు. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు వెళతాం. ఇదే సహకారం మున్ముందు లభించాలని కోరుతున్నాం.

- నిత్యానంద్, అయిజ మునిసిపల్ కమిషనర్

- ఓడీఎఫ్ డబుల్ ప్లస్‌గా అయిజ, గద్వాల
- ఓడీఎఫ్‌గా వడ్డేపల్లి మునిసిపాలిటీ
- అవార్డులు దక్కడంతో అధికారులు, గ్రామస్థుల హర్షం

అయిజ, జనవరి 8 : అయిజ పురపాలక సంఘానికి ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) అవార్డు దక్కింది. పురపాలక సంఘాలకు కేంద్ర పట్టణాభివృద్ధి గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ-2023 సంవత్సరానికి ఓడీఎఫ్ అవార్డులు ప్రకటించింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో అయిజ, గద్వాల, వడ్డేపల్లి, అలంపూర్ మునిసిపాలిటీలు ఉన్నాయి. ఇందులో గద్వాల, అయిజ మునిసిపాలిటీలకు ఓడీఎఫ్(బహిరంగ మల మూత్ర విసర్జన రహిత హోదా) డబుల్ ప్లస్ అవార్డు దక్కింది. తమ పురపాలక సంఘాలకు ఓడీఎఫ్ డబుల్ ప్లస్ అవార్డు దక్కటంతో చైర్మన్, కమిషనర్, అధికారులు, సిబ్బందితో పాటు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ ప్లస్‌కు అర్హత

పట్టణాల్లో ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి ఉండాలి. ఇంటి ఆవరణలోనే సెప్టిక్ ట్యాంకు ఉండాలి. ట్యాంకులను శుభ్రం చేసినపుడు వాటి నుంచి బయటకు తీసిన మల, మూత్ర వ్యర్థాలను తరలించి శుభ్రం చేసేందుకు పట్టణ శివారులోనే శుద్ధి కేంద్రం ఉండాలి. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట, కూడళ్లలో ప్రజలు అత్యవసరాల కోసం సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉండాలి. అవి స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా ఉండాలి. చేతులు శుభ్రం చేసుకునేందుకు సబ్బులు, హ్యాండ్‌వాష్‌లు అందుబాటులో ఉంచాలి. మహిళలు ఉపయోగించే శానిటరీ ప్యాడ్స్, బర్నింగ్ మిషన్ సైతం అందుబాటులో ఉంచాలి. నీటి సదుపాయం ఎక్కువగా ఉండేటట్టు చూడాలి. ఈ సదుపాయాలు, సౌకర్యాలు కలిగి ఉండే పురపాలిక సంఘాలకు ఈ అవకాశం దక్కుతుంది. గత సంవత్సరం కేంద్ర బృంద సభ్యులు పురపాలక సంఘాలపై వారంరోజులు సర్వే నిర్వహించి వివరాలు సేకరించింది. జిల్లాలో గద్వాల, అయిజకు ఈ అర్హతలు ఉండటంతో ఈ రెండు పురపాలక సంఘాలను ఓడీఎఫ్ డబుల్‌గా ప్రకటించింది.

వడ్డేపల్లికి ఓడీఎఫ్

జోగుళాంబ గద్వాల జిల్లాలోని మరో పురపాలక సంఘమైన వడ్డేపల్లి పురపాలక సంఘానికి ఓడీఎఫ్ అవార్డు దక్కింది. ఈ మునిసిపాలిటీలోని ఇళ్లల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు మాత్రమే ప్రాముఖ్యత ఇచ్చి వీటిపై మాత్రమే దృష్టి సారించారు. దీని కారణంగా ఈ పురపాలక సంఘానికి ఓడీఎఫ్ అవార్డు మాత్రమే వచ్చింది.



అయిజ పురపాలక కార్యాలయం

కాళేశ్వరం, టీఎస్‌పీఎస్‌సీ కుంభకోణాలపై

సీబీఐ విచారణ జరిపించాలి

- టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి
- 17 పార్లమెంట్ స్థానాల్లో బీఎస్పీ పోటీ
- డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

కందనూలు, జనవరి 8 : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాలు, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ, కుంభకోణాలపై సీబీఐ విచారణ జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లో ఏర్పాటుచేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశంలో పాల్గొని, మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడంలో వేల కోట్లకు టెండర్లు దక్కించుకుని నాసిరకంగా పనులు చేసిన కన్‌స్ట్రక్షన్ కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిషన్ భగీరథలో జరిగిన కుంభకోణంపై దర్యాప్తు జరపాలన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షా పేపర్లు లీక్ చేసిన అప్పటి చైర్మన్, సభ్యులను కాపాడడం కోసమే గత ప్రభుత్వం సిట్ వేసిందని ఆరోపించిన ఆయన ఇప్పటివరకు సిట్ ఎవరినీ ప్రశ్నించలేదన్నారు. టీఎస్‌పీఎస్‌ని తక్షణమే ప్రక్షాళన చేసి జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీ విపరీతంగా జరిగిందన్నారు. కేసీఆర్ దొర పాలన పోయి మరో దొర పాలన వచ్చిందే తప్ప బహుజనులకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ధరణి పోర్టల్ రద్దు చేస్తామన్న గత హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. అదేవిధంగా, 30వేల ఎకరాల పేదల అసైన్డ్ భూములను బలవంతంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకుని హైదరాబాద్ చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ పేరుతో బడా కంపెనీలకు ఎకరాకు రూ.100కోట్లకు అమ్ముకుందని ఆరోపించిన ఆయన తిరిగి ఆ భూములను పేదలకు ఇవ్వాలన్నారు. గురుకులంలో విద్యార్థినీ ఆత్మహత్యపై స్పందించిన ఆయన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో సైకాలజీ కౌన్సిలర్లను నియమించాలని ప్రభుత్వానికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17స్థానాలకు బీఎస్పీ పోటీ చేస్తుందని, పొత్తులపై బీఎస్పీ అధినేత్రి మాయవతి నిర్ణయమే తుది నిర్ణయమని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకున్నామని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకుముందు నాగర్‌కర్నూల్ మండలం దేశిటిక్యాల, పెద్ద కొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామాల్లో బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

చిక్కేపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

పాన్‌గల్, జనవరి 8 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రఘురాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గత నాలుగైదురోజులుగా ప్రతీరోజు మధ్యాహ్నం నుంచి కార్యదర్శి విధులకు గైర్హాజరు కావడం, గ్రామంలో అతనిపై అవినీతి ఆరోపణలు రావడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రఘురాములు వివరించారు.

అనుమతి లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు

- ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ ఏడీ దినేష్
- అనుమతి లేని ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 8 : ఔషధ నియంత్రణ శాఖ అనుమతి లేకుండా మందుల దుకాణాలు పెట్టుకున్నా, వాటిని నిల్వ పెట్టుకొని విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు ఆర్ఎంపీ క్లినిక్‌లు, మందుల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలోని పాలకొండ గ్రామంలో న్యూ లైఫ్ కేర్ క్లినిక్ అనే పేరుతో అనుమతి లేకుండా మందుల దుకాణం పెట్టుకొని ఓ ఆర్ఎంపీ క్లినిక్ నడుపుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీ చేసి ఆ క్లినిక్‌తో పాటు మందుల దుకాణాన్ని సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ఆకస్మిక దాడులు చేస్తామని, తమ శాఖ అనుమతి లేకుండా మందుల దుకాణాలు నడిపేవారిపై చట్టపరమైన శిక్షలు ఉంటాయని, మూడేళ్ల వరకు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ప్రతీ మందుల దుకాణంలో ఫార్మాసిస్టు తప్పనిసరిగా ఉండాలని, వారి పర్యవేక్షణలోనే మందులు విక్రయించాలన్నారు. అదేవిధంగా ఆర్ఎంపీలు కూడా తమ క్లినిక్‌లలో మందులు పెట్టుకొని విక్రయించొద్దని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో మహబూబ్‌నగర్ డ్రగ్ ఇన్స్‌పెక్టర్ రబియ, జడ్చర్ల డ్రగ్ ఇన్స్‌పెక్టర్ రష్మిషేక్, సిబ్బంది తదితరులున్నారు.

పుట్టిన రోజే పరలోకానికి

- బెంగళూర్‌లో డివైడర్‌కు ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



వాసుదేవచారి(ఫైల్)

నారాయణపేట, జనవరి 8 : బెంగళూర్‌లో డివైడర్‌ను ఢీకొని నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం నారాయణపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వాసుదేవచారి(25) సోమవారం ఉదయం బెంగళూరులో స్కూటీపై వెళ్తూ డివైడర్‌ను ఢీకొని తల పగిలి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పేటకు చెందిన శ్రీనివాస్, పద్మాక్షి దంపతులకు ఇదరు కుమారులు. మొదటి కుమారుడు చారు ఆచార్య హైదరాబాద్ విమానశ్రయంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. రెండో కుమారుడు వాసుదేవచారి బెంగళూరులో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఉండగా, తల్లిదండ్రులు, సోదరుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. సోమవారం పుట్టినరోజు కావడంతో ఉదయమే వాసుదేవచారి స్కూటీపై స్నేహితుడితో కలిసి నందిహిల్స్ శివాలయంలో సూర్యుడి కిరణాలు కనువిందు చేసే దృశ్యాన్ని తిలకించేందుకు ఆతృతతో వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఇనుప రాడ్‌కు ఢీకొని తల పగిలి మృతి చెందాడు. వెనుకనున్న స్నేహితుడు ఆసుపత్రి పాలయ్యాడు. జరిగిన ఘటనను కర్నాటక పోలీసులు కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారమందించడంతో హుటాహుటిన వారు హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు తరలివెళ్లారు.

సెల్‌ఫోన్లు రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, జనవరి 8 : పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న, దొంగతనాలకు గురైన వాటిని పోలీసులు రికవరీ చేశారు. దాదాపు 12 ఫోన్‌లను రికవరీ చేసిన పోలీసులు సోమవారం వాటిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఫోన్‌లను గుర్తించారు. సీఈఐఆర్ టెక్నాలజీ ఆధారంగా ఐడీ పార్టీ పోలీసులు ఫోన్‌లను గుర్తించడంతో వన్‌టౌన్ సీఐ బాలాజీ ఆధ్వర్యంలో వాటిని బాధితులకు అప్పగించడంతో వారందరూ సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు డివైడర్ ఎక్కిన కారు

జడ్చర్ల, జనవరి 8 : జాతీయ రహదారి జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో అతివేగంగా వచ్చిన కారు రోడ్డు డివైడర్ ఎక్కిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ఐదుగురు వ్యక్తులు కారులో బయలుదేరారు. మాచారం సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. కాగా, డివైడర్‌పై ఉన్న కారును జడ్చర్ల పోలీసులు పక్కకి తొలగించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- 20 లీటర్ల సారా స్వాధీనం

తెలకపల్లి, జనవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల మండలం దేవదారికుంట, కంసానిపల్లిలో ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ హైదరాబాద్ ఆదేశానుసారం సోమవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జి సీఐ జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు కేసులు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బాలవర్థి, సిబ్బంది, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గణపతిరెడ్డి, క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

తోడేళ్ల దాడిలో ఐదు గొర్రెలు మృతి

ఇటిక్యాల, జనవరి 8 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో ఏర్పాటుచేసిన గొర్రెల మందలో ఐదు జీవాలు మృతి చెందాయి. ఎర్రవల్లికి చెందిన గొర్రెల యజమానులు రామాంజనేయులు, మద్దిలేటిలు గ్రామ శివారులోని ఓ రైతు పొలంలో మందను ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో మందపై తోడేలు దాడి చేసింది. దాడిలో ఐదు గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. మరో మూడు గొర్రెలకు తీవ్ర గాయాలైనట్లు వారు వివరించారు. గొర్రెల మృతితో రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

జడ్చర్ల, జనవరి 8 : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్ ప్రాంగణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో ఆదివారం రాత్రి రైలు వస్తున్న విషయాన్ని గ్రహించకుండా ఓ వ్యక్తి(35) రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు కృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

భూత్పూర్, జనవరి 8 : మండల పరిధిలోని పోతులమడుగు స్టేజీ వద్ద సోమవారం రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని(32) గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స కోసం వచ్చిన వృద్ధుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 8 : చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ వృద్ధుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని శ్రీపురం గ్రామానికి చెందిన చిన్నయ్య(65) రెండురోజుల క్రితం చూపించుకునేందుకు ఇంటి నుంచి ఆసుపత్రికి వచ్చాడు. అయితే, గత రెండురోజులుగా అతను ఆసుపత్రి ఆవరణలో నిద్రిస్తున్నాడు. ఆదివారం ఆసుపత్రి ఆవరణలో నిద్రించిన ఆయన సోమవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



చెవుల సురేశ్

మద్దూర్, జనవరి 8 : నారాయణపేట జిల్లా మద్దూర్ మండలం పల్లెర్ల గ్రామంలో ఇంటర్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్సై సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెవుల సురేశ్ మద్దూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల ఏడో తేదీన పుస్తకాలు, జిరాక్స్ నోట్స్ కొంటానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సురేశ్ రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబీకులు అచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేలు ఆడుతున్న వ్యక్తులపై కేసు

లింగాల, జనవరి 8 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం దారారం పెద్దవాగు సమీపంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన పందెంరాయుళ్లు అక్కడ్నుంచి పరారయ్యారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. సంక్రాంతి పండుగ రోజున కోడి పందేలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందాలి



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి

గండీడ్, జనవరి 8: సంక్షేమ పథకాలు పేదలకు అందాలని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల అభివృద్ధి కార్యాలయంలో పది మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు, కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు అందేలా కలెక్టర్లతో మాట్లాడినట్లు తెలిపారు. గండీడ్, మహమ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో విలీనం చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. పాలమూరు ఎత్తిపోతలతో రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు హన్మయ్య, ఎంపీటీసీ సభ్యుడు బాలయ్య, పార్టీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, కెఎం నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ వైస్‌ఎంపీపీ రాధారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శంకర్ నాయక్, తహసీల్దార్ నాగలక్ష్మి, పీఆర్ ఏఈ రాబర్ట్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, నరోత్తం రెడ్డి, ఆశిరెడ్డి, పులిందర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, రాములు, సుదర్శన్ రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అడ్డాకులలో అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

అడ్డాకుల, జనవరి 8: అడ్డాకుల మండల పరిధిలోని పొన్నకల్, కాటవరం గ్రామాల్లో సోమవారం అయోధ్య రాముడి పూజిత అక్షింతలను భక్తులు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఆయా గ్రామాల దేవాలయాలలో ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి అక్షింతలను పంపిణీ చేశారు. పొన్నకల్‌లో భక్తులు వీధుల గుండా భజనలు చేస్తూ అక్షింతలను పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ నెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇంట్లో దీపాలు వెలిగించి అక్షింతలకు ఇంట్లో పూజ చేసి అందరు చల్లుకోవాలని నిర్వాహకులు సూచించారు.

దేవరకద్ర: ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడని సమాజంలో ప్రతీ ఒక్కరు ఆయన అడుగుజాడలో నడువాలని సర్పంచ్ శ్రీనివాసులు కోరారు. సోమవారం కౌకుంట్ల మండల పరిధిలోని పుట్టపల్లి దేవాలయం నుంచి శ్రీరామ అంక్షింతల శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. గ్రామపురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి శ్రీరాముడి అంక్షితలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: చింతకుంట మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీరామ జన్మభూమి అంక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామంలో అక్షింతలను ప్రజలకు పంపిణీ చేశారు.

నవాబ్‌పేట: మండలంలోని కూచూర్, తూక్యతండా, సీతమ్మతండాలో స్థానికులు సోమవారం అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ చేసి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, పిట్టల రవి, బోజయ్యచారి పాల్గొన్నారు.

యన్మనగండ్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తాళాలు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్ఐ గోవర్ధన్

నవాబ్‌పేట, జనవరి 8: మండలంలోని యన్మనగండ్ల గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ ఇళ్లకు గ్రామస్థులు కొందరు తాళాలు వేస్తున్నారు. దాంతో రెవెన్యూ అధికారులు డబుల్ ఇళ్ల వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామానికి మొత్తం 54 డబుల్ ఇళ్ల పనులను అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సీ. లక్ష్మారెడ్డి పూర్తి చేయించారు. మూడు నెలలక్రితం ఎమ్మెల్యే హోదాలో లక్ష్మారెడ్డి గ్రామానికి చేరుకొని డబుల్ ఇళ్లను ప్రారంభించారు. గ్రామానికి చెందిన పలువురిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. తర్వాత వారికి ఎలాంటి మంజూరుపత్రాలు ఇవ్వలేదు. తాజాగా గ్రామానికి చెందిన కొందరు డబుల్ ఇళ్లు తమకే ఇచ్చారంటూ తాళాలు వేసుకున్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

మైసమ్మ ఆలయంలో ఎంపీ పూజలు



ఆలయంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

నవాబ్‌పేట, జనవరి 8: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మను మహబూబ్‌గర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం మైసమ్మ ఆలయ జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ సిబ్బంది ఎంపీకి స్వాగతం పలికి ఆలయ సాంప్రదాయ ప్రకారం సన్మానించారు. అంతకుముందు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పీ.రంగారావు, ఆలయ కమిటీ చైర్మన్ పాశం కృష్ణయ్య, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, నరేందర్, వెంకట్‌రెడ్డి, అంకం ఆంజనేయులు, సుభాన్‌చారి, బుచ్చయ్య, నారాయణ రెడ్డి, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారులు

పాలమూరు, జనవరి 8 : తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ (తంసా) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎఫ్‌టీసీ కేంద్రంలో వ్యవసాయాధికారి బి.వెంకటేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆత్మపీడీ హన్యానాయక్ మాట్లాడుతూ పని విభజన చేసుకోవటానికి ఏరోజు, ఎక్కడికి వెళ్లి, ఎవరిని కలవాలనే దానికి క్యాలెండర్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తంసా ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రామరెడ్డి, విజయ్‌కుమార్, యశ్వంత్‌కుమార్, కృపాకర్‌రెడ్డి, షౌకత్‌అలీ, తస్లీమ్, మాధవి, కరుణ, కృష్ణకాంత్, రాంపాల్, మురళీధర్, ప్రవీణ్, శశిధర్, రవి, శేఖర్, లూథర్, సుధాకర్, మల్లేష్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయించాలి



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గండీడ్, జనవరి 8: బీటీ రోడ్డు మంజూరు చేయించాలని జిన్నారం గ్రామ నాయకులు కోరారు. సోమవారం ముఖ్యమంత్రి సోదరుడు, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని కాంగ్రెస్ గ్రామ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోస్గి నుంచి జిన్నారం గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆశిరెడ్డి, తిమ్మారెడ్డి, మహేందర్, లక్ష్మయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి

అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ జి. రవినాయక్
- 'ప్రజావాణి'లో వినతిపత్రాల స్వీకరణ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 8 : రాష్ట్ర స్థాయి ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ జి. రవినాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. భూములకు, దళితబంధు, ఇతర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. అధికారులు ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా మండలస్థాయిలో ఉండే సమస్యలకు సంబంధించి సంబంధిత తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ప్రజాపాలన ద్వారా స్వీకరించిన డేటా ఆన్‌లైన్‌లో నమోదు పకడ్బందీగా నమోదు చేయాలని, ఎట్టి పరిస్థితులలో తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దని ఆదేశించారు. ప్రతీ రోజు డేటా నమోదు చేసి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా ఆపరేటర్లను ఆదేశించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, జడ్పీసీఈవో జ్యోతి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జి.రవినాయక్

'దళితబంధు' ఇవ్వండి

మహ్మదాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 75 మంది దళితులుకు అప్పటి ప్రభుత్వం దతబంధు మంజూరు చేసింది. అందుకు సంబంధించి ఆయా బ్యాంకులలో అకౌంట్లు ఓపెన్ చేశాం. అసెంబ్లీ ఎన్నికల ప్రకటన, ఆ వెంటే కోడ్ రావడంతో దళితబంధును తీసుకోలేకపోయాము. ఇప్పుడు దళితులకు మంజూరైన దళితబంధును ఇవ్వాలని వివిధ గ్రామాలకు చెందిన దళితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

కొత్త పాస్‌పుస్తకాన్ని ఇప్పించాలి

ఉదండపూర్ రిజర్వాయర్ కోసం పెద్దపల్లి గ్రామం వల్లూరు శివారు సర్వే నెంబర్ 93లో 9.3 ఎకరాలు మా పేర ఉంది. అందులో మూడు ఎకరాలు పోలం ప్రాజెక్ట్ నిర్మాణానికి తీసుకున్నారు. మిగులు 6.3 ఎకరాలకు కొత్తపాస్ పుస్తకాన్ని ఇప్పించాలని ఆ గ్రామానికి చెందిన రైతులు అల్లె వెకటయ్య, అల్లె అంజయ్య ప్రజావాణితో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

పరిహారం ఇప్పించాలి

ఇటీవల నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా భవన నిర్మాణంలో ఇంటి ప్లాట్లు కోల్పోయాం. అందుకు సంబంధించి పరిహారాన్ని ఇప్పించాలని పాలమూరు పట్టణానికి చెందిన ఐదుగురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

యాసంగి సీఎంఆర్‌పై దృష్టి పెట్టాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 8 : వానాకాలం కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)కు సంబంధించి ఇంకా చెల్లించాల్సిన 10శాతం బియ్యాన్ని తక్షణమే పూర్తి చేసి యాసంగి సీఎంఆర్‌పై దృష్టి పెట్టాలని కలెక్టర్ జి. రవినాయక్ పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వానాకాలం, యాసంగి సీఎంఆర్‌పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వానాకాలం సీఎంఆర్‌కు సంబంధించి 90శాతం లక్ష్యం సాధించామని, మిగిలిన 10 శాతం సైతం పూర్తి చేయాలని చెప్పారు. అలాగే ఈ నెలాఖరు నాటికీ ప్రభుత్వం ఆదేశించినట్లుగా యాసంగి సీఎంఆర్ సైతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు గాను ఆయా మిల్లుల వారిగా సమీక్షించి సీఎంఆర్ చెల్లించాల్సిన మిల్లర్లు త్వరిత గతిన చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, శిక్షణ ఎస్పీ చిత్తరంజన్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ప్రవీణ్, డీఎస్‌వో శ్రీనివాసులు, డిపోగోడౌన్ మేనేజర్ అస్లామ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరుగుతుంది

- మహిళలకు ఉచిత బస్ ప్రయాణంతో ఆర్టీసీపై గౌరవం పెరిగింది
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 8: ప్రజాప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బందికి అన్ని రకాలుగా న్యాయం జరుగుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సామాన్యుడి నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగిన జిల్లా బిడ్డ రేవంత్ రెడ్డికి ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. సోమవారం జిల్లాకేంద్రంలోని రైస్‌మిల్లు అసోసియేషన్ భవనంలో ఆర్టీసీ సంఘాలు టీఎస్ ఆర్టీసీ, ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూసీ సంఘాలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఆర్టీసీ గౌరవం, ప్రతిష్టను పెంచాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకున్నా వాటిని ఎదుర్కొని ప్రజాక్షేత్రంలో ప్రజలను ఒప్పించి మెప్పించిన నాయకుడు రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. వీలైనంత త్వరగా ఆర్టీసీ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రికి విన్నవిస్తానని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రజల ఆస్తిని ఆ ఆస్తి ఇంచు కబ్జాకు గురైన తాను అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు వారి అవసరాల కోసం దాచుకున్న సొమ్మును కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కాజేసిందని ఆరోపించారు. ఈ ప్రజా ప్రభుత్వంలో మీ అందరికీ న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లాకొత్వాల్, నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, ఎం సురేందర్‌రెడ్డి, టి రాజేందర్‌రెడ్డి, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, అమరేందర్‌రాజు, అహ్మద్, ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ డి గోపాల్, సహాయకార్యదర్శి సాయిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజర్ విజయ్ బాబు, జిల్లా బాధ్యులు రాములుయాదవ్, శ్రీను, సాయిబాబ, బెనహర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఆగవు

మహబూబ్‌నగర్ రూరల్ : కాంగ్రెస్ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, కల్యాణలక్ష్మి చెక్కులు రావని, పింఛన్లు ఆగిపోతాయని బీఆర్ఎస్ ప్రచారం చేసిందని, అవేమీ ఆగలేదని, చెక్కులు వస్తున్నాయని, పింఛన్ ఇస్తున్నామని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ సుందర్‌రాజు, నయాబ్ తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, మల్లు నర్సింహారెడ్డి, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సాయిబాబ, నాగమణి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, మాధవరెడ్డి, రాంచంద్రయ్య, రాజుగౌడ్, మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

104 ఏళ్ల చరిత్ర కలిగినది ఏఐటీయూసీ

పాలమూరు : ప్రతీ నిత్యం కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్న ఏఐటీయూసీకి 104ఏళ్ల చరిత్ర కలిగి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఐటీయూసీ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాకం రాంమోహన్, నాయకులు సత్య నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, టి.నరసింహ, లక్ష్మయ్య, ప్రకాష్, వీ రేంద్రకుమార్, కృష్ణయ్య, బి.ఆర్ విల్సన్, మంజుల, అలివేలు, పార్వతమ్మ, చిన్న మ్మ, శివనాయక్, ఆనందు, శ్రీధర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : పాలమూరు క్రీడాకారులు జాతీయస్థాయి రాణించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్రసత్యం కాలనీ సమీపంలో గల మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ మైదానంలో నూతనంగా నిర్మించిన గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, దేవరాజ్, మహబూబ్ నగర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సురేష్, కార్యదర్శి రాజశేఖర్, సిరాజ్‌ఖాద్రి, మనోహర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్

జడ్చర్ల, జనవరి 8 : జడ్చర్ల నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10:30నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీటీ స్వప్న

అడ్డాకుల, జనవరి 8: అడ్డాకుల డిప్యూటీ తహసీల్దార్‌గా స్వప్న సోమవారం రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు చేట్టారు. ఇక్కడ డీటీగా పని చేసిన శ్రీనివాసులు ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కాగా, ఈ సందర్భంగా డీటీ స్వప్న మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనులు వేగంగా జరగడానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

రాజాపూర్, జనవరి 8: మండలపరిధిలోని తిరుమలపూర్ గ్రామంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్‌శాఖ కళాబృందం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు శాఖ కళాబృందంసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం

జడ్చర్ల, జనవరి 8 : జడ్చర్ల మునిసిపాలిటీలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న హజ్రత్ ఖాజాఅబ్దుల్లాబిన్ సిద్దిఖ్ చిస్తీ దర్గా ఉర్సు సోమవారం ఘనంగా ప్రారంభమైంది. గంధోత్సవం నిర్వహించారు. 9న దీపారాధన, 10న ఖత్మె ఖురాన్ పఠనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దర్గా ఆవరణలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు.

'ఎస్సీ వర్గీకరణను విస్మరించడం సరికాదు'

పాలమూరు, జనవరి 8 : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విస్మరించడం సరికాదని ఎమ్మార్పీఎస్-టీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న జిల్లా స్థాయిలో సదస్సు ఏర్పాటు చేసుకుని విధి విధానాలు రూపొందించుకుంటామన్నారు. కార్యక్రమంలో నరేష్, కృష్ణ, యాదయ్య, రాజు, రమేష్, నరసింహ, వెంకటసాయి, చిన్న, కృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమణలపై జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి పరిశీలన

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), జనవరి 8: మహబూబ్ నగర్ పట్టణంతో పాటు, చుట్టూ పక్కల ప్రాంతాలలో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై జిల్లా యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాలలో పర్యటించి చెరువు శిఖం భూములు, ఇతర ప్రభుత్వ స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

రామాయణ బాలకాండపై కంఠస్థ పోటీలు

పాలమూరు, జనవరి 8 : సంస్కృత భారతి పాలమూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న రామాయణ బాలకాండపై కంఠస్థపోటీలు నిర్వహించనున్నట్లు సంస్కృతభారతి విభాగ్ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మలిశెట్టి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో ఎవరైన పాల్గొన వచ్చని వయసు పరిమితి లేదన్నారు. వందశ్లోకాలు అప్పగించాలన్నారు. గెలుపొందినవారికి సన్మానం, ప్రశంసాపత్రం, మెమొంటో అందజేస్తామని తెలిపారు. శ్రీమద్ భగవద్గీతలోని 14,15,16,17 శ్లోకాలతోపాటు , గీతా మహ త్యం మొ దటి తొమ్మిది శ్లోకాలు మొత్తం వంద శ్లోకాలు పోటీల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. 21వ తేదీన ఉదయం 9గంటల నుంచి పోటీలను ప్రారంభిస్తామన్నారు.

పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జనవరి 8: పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ యూనియన్ గుర్తింపు పొందిన 3194 అఫ్లిమేటెడ్ ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా జైపాల్, ప్రధాన కార్యదర్శిగా శరభలింగ్, కోశా ధికారిగా ప్రమోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు యూనియన్ రాష్ట్ర నాయకులు నిర్మల, కోరమోని భూషన్ ముఖ్య అతిదులుగా పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులందరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు బీచుపల్లి గౌడ్ లక్ష్మీరమణ, వినోదిని, మాధ వి పాల్గొన్నారు.

సైన్స్ ఫెస్ట్‌ను సందర్శించిన విద్యార్థులు

జడ్చర్ల, జనవరి 8 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీ పంలో జరుగుతున్న ఇండియన్ ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్‌ను సోమవారం జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యా ర్థులు సందర్శించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, వైజ్ఞానిక యాత్రలో భాగంగా సైన్స్ ఫెస్ట్‌కు కళాశాలలోని టీఎస్‌కేసీ ,ఫిజికల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో 33 మంది విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉదయ్‌కుమార్, డాక్టర్ మంజుల, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ రమాదేవి, ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- పదవ తరగతి విద్యార్థికి కీలకం
- ప్రేరణ సదస్సులో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 8 : విద్యార్థులకు పదో తరగతి చాలా కీలకమని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇష్టపడి చదవాలని అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ గ్రామీణ ఉన్నతపాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరై మాట్లాడారు. పదవ తరగతి తర్వాత ఏరంగంలోకి వెళ్లాలనే స్పష్టత విద్యార్థులకు ఉండాలని , ఏ కోర్సు చదవాలో నిర్ణయించుకోవాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని చదవాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. డీఈవో రవీందర్ మాట్లాడుతూ పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ముందుండాలన్నారు. పదవతరగతి పరీక్షలపై అవగాహన కల్పించేందుకు విషయ నిపుణులతో ప్రత్యేక స్టడీమెటీరియల్ రూపొందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేసి పదిలో మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. సమావేశంలో సీఎంవో బైకాని బాలుయాదవ్, ఎంఎంవో శ్రీనివాస్, హెచ్ఎంలు కృష్ణయ్య, వెంకటేశ్వరమ్మ, రవీందర్‌గౌడ్, ఖాజా , రహిమాన్, ఉష, వెంకటమ్మ, సువర్ణ, మండ విద్యాశాఖ అధికారి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



అడ్డాకులలో ప్రజాపాలన దాటా ఎంట్రీపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్

అడ్డాకులలో ప్రజాపాలన డాటా ఎంట్రీ పరిశీలన

అడ్డాకుల: అడ్డాకుల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన డాటా ఎంట్రీని సోమవారం సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. ఎంత వరకు పనులు పూర్తి అయ్యాయని ఎంపీడీవో మంజులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా సకాలంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీదేవి, సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయంలో కొబ్బరికాయల వేలం

జడ్చర్ల, జనవరి 8 : జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం దేవాలయం ఆవరణలో కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పల వేలం నిర్వహించారు. వేలాన్ని దేవాదాయశాఖ సహాయ కమిషనర్, జిల్లా పర్యవేక్షకులు వీణాధరి, ఆలయ కార్య నిర్వాహక అధికారి దీప్తిరెడ్డి సమక్షంలో నిర్వహించారు. కాగా, తలనీలాలు, ప్రసాదం విక్రయానికి సంబంధించి వేలానికి ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశారు. సమావేశంలో ఆలయ పూజారి రాజగోపాలాచారి, ఆలయ వ్యవస్థాపక వంశీయులు గోకుల, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచులు అనంత్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, స్థానికులు గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మలింగం, చెన్నయ్య, శంకర్, ఓంకార్‌గుప్త, బద్రీనాథ్, వెంకటేశ్వర్‌రెడ్డి, శంకర్‌మేస్త్రీ పాల్గొన్నారు.

విజయ డెయిరీ చైర్‌పర్సన్‌ను కలిసిన రాజ్‌కుమార్

నవాబ్‌పేట,జనవరి 8: విజయడెయిరీ చైర్‌పర్సన్ చిట్టెం లక్ష్మిని సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా విజయడెయిరీ చైర్మన్ కారుకొండ రాజకుమార్ మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నర్సింహులు, నరేష్, గోపాల్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'నవాబ్‌పేటకు ఎస్ఐని నియమించాలి'

నవాబ్‌పేట,జనవరి 8: నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐని నియమించాలని నవాబ్‌పేట మండలం బంగరం పల్లి గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది డీ. గోపాల్ యాదవ్ కోరారు. సోమవారం డీజీపీ రవిగుప్తను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను త్వరలో పరిష్కరిస్తామని డీజీపీ తెలిపారని న్యాయవాది గోపాల్ యాదవ్ తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు శాంతకుమార్

బాలానగర్, జనవరి 8: కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ అన్నారు. సోమ వారం మండంలోని చింగులగడ్డతండాలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతకుమార్ మాట్లాడుతూ గ్రామాల, మారుమూల గిరిజన తండాల అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యాంత్రీకరణ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు డ్రోన్ ద్వారా ఎరువులు చల్లే విధానాన్ని ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, అభినాష్, శ్రీశైలం, సర్పంచ్ రవినాయక్, యాదయ్య, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో ..

నవాబ్‌పేట: మండలంలోని చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం వికసిత భారత్ సంకల్పయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, మండల అధ్యక్షుడు కారుకొండ రాజు ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, మల్లేష్, శివాజీ, రాఘవేందర్, ఆశ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.